www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 25 ఫిబ్రవరి 2025

పాలకొల్లులో సినిమా షూటింగ్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు రైల్వే గేటుకు సమీపంలోని గీతా అన్నపూర్ణ థియేటర్‌లో సోమవారం సినిమా షూటింగ్ జరిగింది. నవీన్ పోలిశెట్టి హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు మారి కొత్త దర్శకుడుగా పరిచయం అవుతున్నారు. ఈ థియేటర్‌లో ప్రభాస్ నటించిన బాహుబలి చిత్రం రిలీజ్ అయినట్టు ప్రభాస్ ఫ్యాన్స్‌తో కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. దీంతో సినిమా షూటింగ్ చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు తరలివస్తున్నారు. పట్టణ ఎస్ఐ, ఎఎస్ఐలు అభిమానులను అదుపు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. సితార ఎంటర్టైన్మెంట్ ఈ చిత్రం నిర్మిస్తోంది. మరో 10 రోజుల పాటు పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో సినిమా మొదటి షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతుందని యూనిట్ చెబుతోంది.

కొల్లేరు సమస్యపై భరోసా కరువు..!

సిఎం, డిప్యూటీ సిఎంలతో ఎంపీ పుట్టా, ఎంఎల్ఎలు సమావేశం
జిరాయితీ, సొసైటీ భూములు 22 వేల ఎకరాలపై చర్చ
చెరువుల ధ్వంసం సమస్యను లేవనెత్తిన ప్రజాప్రతినిధులు
వెంటనే ఆపేలా చర్యలకు ప్రభుత్వం నుంచి దక్కని హామీ
సంబంధిత శాఖలతో మరో వారం, పది రోజుల్లో సమావేశమని ముక్తాయింపు
కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని మాటలతో సరి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరులో చెరువులకు గండ్లు కొడుతూ ధ్వంసం చేస్తున్న సమస్యకు ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా లభించకపోవడంపై కొల్లేరు రైతులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. సుప్రీంకోర్టు ఆదేశాలంటూ అటవీశాఖ అధికారులు కొన్ని రోజులుగా చేపల చెరువులకు గండ్లు కొట్టడం కొల్లేరు రైతులను నిద్రలేకుండా చేస్తోంది. చెరువులకు గండ్లు కొడితే తీవ్రంగా నష్టపోతామని, కొల్లేరు సరిహద్దులు సరిగా నిర్ణయించకపోవడంతో ఇప్పటికే జిరాయితీ, సొసైటీ భూములను సైతం కోల్పోయామని వాపోతున్నారు. ఇప్పుడు ఉన్న చెరువులకు గండ్లు కొడితే తాము రోడ్డున పడాల్సి వస్తుందని కొల్లేరు ప్రాంత ప్రజలు ఘొల్లుమంటున్న పరిస్థితి ఉంది. దీనిపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో కొల్లేరును ఆనుకుని ఉన్న ఎంఎల్ఎలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, జడిఇ రాధాకృష్ణయ్య, పత్సమట్ల ధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు సోమవారం అమరావతి సచివాలయంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమావేశంలో ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రి కొలుసు పార్థసారథి సైతం పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులంతా కొల్లేరు రైతుల సమస్యలను, అక్కడి ఇబ్బందులను సిఎం, డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్లారు. జిరాయితీ భూములు 15 వేల ఎకరాలు, సొసైటీ భూములు ఏడు వేల ఎకరాలు విడదీయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని, గత వైసిపి ప్రభుత్వం సర్వే చేసి హద్దులు నిర్ణయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తెలిపారు. ఆ కారణంగా కొల్లేరు ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని ఎంపీ, ఎంఎల్ఎలంతా సిఎం, డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్లారు. కొల్లేరు ప్రాంత ప్రజల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని సమస్య పరిష్కారానికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని వీరంతా కోరారు. కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. జిల్లా ప్రజాప్రతినిధులతో సిఎం, డిప్యూటీ సిఎం కొల్లేరు సమస్యపై సమగ్రంగా చర్చించినట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి కొల్లేరు ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కొల్లేరు ప్రాంతంలో పర్యావరణానికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా, అక్కడి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగు న్యాయం చేయడానికి ప్రభుత్వపరంగా పూర్తి అండగా ఉంటామని సిఎం, డిప్యూటీ సిఎం చెప్పినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు.

చెరువుల ధ్వంసంపై మరోసారి సమావేశం

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కొల్లేరు ప్రాంతంలో అధికారులు చేపట్టిన చెరువుల ధ్వంసం ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసే దిశగా న్యాయపరంగా ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారని ప్రజాప్రతినిధులు తెలిపారు. త్వరలో పర్యావరణ, అటవీశాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి ప్రభుత్వం ఒక నిర్ణయానికి వస్తుందని హామీ ఇచ్చినట్లు తెలిసింది. చెరువుల ధ్వంసం నిలిపివేతకు ప్రభుత్వం భరోసా ఇస్తుందని ఆశించిన కొల్లేరు రైతులు తీవ్ర నిర్వేదంలో మునిగిపోయారు. అధికారులిచ్చిన నివేదిక ఆధారంగా కొల్లేరు ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అక్కడి ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సిఎం చెప్పినట్లు ఎంపీ, ఎంఎల్ఎలు చెబుతున్నారు. కొల్లేరు ప్రాంత ప్రజలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందనే విషయాన్ని అక్కడి ప్రజలకు తెలియజేయాలని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు సిఎం సూచించినట్లు తెలిపారు. కొల్లేరు సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారన్నారు.

ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి
కె.ఉమా మహేశ్వరరావు
మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి, ప్రయివేటు ఏజెన్సీలకు అప్పజెప్పే కూటమి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సిఎం కార్యాలయానికి వెలగపూడి అడ్రస్‌కు పోస్టుకార్డులు పోస్టు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని, మున్సిపల్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, ఎన్ఎంఆర్‌లు భావించారని, పర్మినెంట్ కార్మికుల డిఎ బకాయిలు, సరెండర్ లీవులు, జిపిఎఫ్ అకౌంట్స్ క్లియర్ అవుతాయని ఆశించారని తెలిపారు. ఇంజినీరింగ్ కార్మికులు చాలీచాలని జీతాలతో బతుకుతున్నారని, జీతాలు పెంచుతారని, ఉద్యోగ భద్రత కల్పిస్తారని, సంక్షేమ పథకాలు అమలు చేస్తారని భావించారని తెలిపారు. కోవిడ్, బదిలీ కార్మికులు, ఎన్ఎంఆర్‌లకు మున్సిపల్ కార్మికులతో పాటు జీతాలు చెల్లించడం లేదని వాపోయారు. అనేక సమస్యలతో వారు బాధపడుతున్నారని తెలిపారు. ఆప్కాస్ ద్వారా ఒకటి, రెండో తేదీన జీతాలు వస్తున్నాయని, పిఎఫ్, ఇఎస్ఐ సొమ్ము సక్రమంగా జమవుతున్నాయని, ఈ సొమ్ము ఎవరూ కాజేయడం లేదని తెలిపారు. ప్రస్తుతం పాత విధానాన్ని తీసేసి ప్రయివేటు ఏజెన్సీలకు అప్పజెబుతామని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. ప్రయివేటు ఏజెన్సీలకు అప్పజెపితే మున్సిపల్ కార్మికులకు జీతాలు సక్రమంగా రావని, ఆరు, ఏడు నెలల వేతన బకాయిలు రద్దవుతాయని, మున్సిపల్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, ఎన్ఎంఆర్‌లు జీతాలు కొల్లగొట్టేందుకు అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఈ విధానాలను రద్దు చేయాలని, ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించొద్దని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతున్న సందర్భంగా ముఖ్యమంత్రికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాల్టీల నుంచి కార్మికులందరూ పోస్ట్ కార్డులు పంపారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మార్చి 5వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్నాలో కార్మికులు, ఉద్యోగులు, ఎన్ఎంఆర్‌లు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా కార్యదర్శి ధనాల వెంకటరావు, యూనియన్ వైఎస్ ప్రెసిడెంట్ కొడమంచిలి బాబు, కోరి విజయకుమార్, రఘుపర్తి ప్రతాప్‌సింగ్, యర్రంశెట్టి రాంపాల్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమా మహేశ్వరరావు

ప్రజా సమస్యలపై పోరాడేది
పిడిఎఫ్ మాత్రమే

ప్రజాశక్తితో సిట్టింగ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి)

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి ఓటు వేశారు. తొమ్మిది నెలలవుతున్నా వారికిచ్చిన హామీలను ఏమాత్రం అమలు చేయలేకపోతున్నారు. ముఖ్యంగా నిరుద్యోగుల సమస్యలను కనీసంగానైనా పట్టించుకోవడం లేదు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఈ ప్రభుత్వంపై కన్పిస్తోంది. విజ్ఞులైన పట్టభద్రులు కూటమి అభ్యర్థిని తప్పకుండా ఓడిస్తారు. సొంత ప్రయోజనాలను పక్కనపెట్టి ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా, ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిత్యం ప్రజా పోరాటాలు సాగిస్తున్నారు. ఆ ప్రజలే పిడిఎఫ్ ఎంఎల్‌సిలను మరోసారి గెలిపిస్తారని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల సిట్టింగ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను ఆయన పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న కూటమి

ప్రస్తుతం ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ఉత్తరాంధ్ర జిల్లాల ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతున్నాయి. మూడు చోట్ల కూటమి పక్షాన అభ్యర్థులు పోటీలో నిలిచారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతుంది. అది వ్యతిరేక ఓటుగా మారే అవకాశం ఉంది. కూటమిని ఎవరూ కూల్చనక్కర్లేదు. దానికి అదే కూల్చేసుకుంటుంది. ప్రజా వ్యతిరేకతే ఆ రకంగా పని చేస్తుంది. గతంలో కూడా ఇంత చేశాం. అంత చేశామని గొప్పలు చెప్పుకున్న జగన్మోహన్‌రెడ్డికి కూడా ఇదే అనుభవం ఎదురైంది. ఆ రకంగా గ్రాడ్యుయేట్స్ స్థానాలు అన్నింటా పాలకపక్షం ఓటమి చవిచూసింది. అధికారంలో ఉన్న వాళ్లు ఎన్ని హామీలిచ్చినా వాటి అమలులో జాప్యం వంటి ఇతర అనేక కారణాలు అధికార పక్షానికి వ్యతిరేక గాలి వీచే అవకాశం ఉంది. ఇటువంటి కారణాలతో అధికార పార్టీ అభ్యర్థిని పోటీలో పెట్టిస్తే గెలుపు నల్లేరు మీద నడక అనుకుంటే సాధ్యం కాదు. పిడిఎఫ్ బలమైన పునాది కలిగి, వ్యవస్థీకృతమైన ఓటింగ్ కలిగినటువంటి ఒక వ్యవస్థగా నేడు అభివృద్ధి చెందింది. అదే పిడిఎఫ్ గెలుపునకు ఒక శుభ పరిణామం.

ప్రజా సమస్యలపై పోరాడే, మాట్లాడే వేదికగా పిడిఎఫ్

పిడిఎఫ్‌కు వర్గ, ప్రజా సంఘాల మద్దతు పూర్తిగా ఉంది. అదే గెలుపులో కీలక భూమిక పోషిస్తుంది. 2007 నుంచి సుమారు 18 ఏళ్ల పాటు పిడిఎఫ్ తరపున పోటీ చేసిన అభ్యర్థులు గెలిచి ప్రజా సమస్యలపై పోరాడారు. శాసనమండలి బయట, లోపల కూడా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేశారు. ప్రజల సమస్యలు విని, వినతులు తీసుకుని శాసనమండలిలో గళం వినిపించడంతోపాటు అవసరమైతే దాని మీద ప్రభుత్వానికి లేఖలు కూడా రాశాం. ప్రజాసంఘాలు చేస్తున్న అనేక పోరాట, ఉద్యమాలకు మద్దతుగా నిలిచాం. ప్రత్యక్షంగా పాల్గొంటున్నాం. ఇటువంటి పని ఏ అధికార, ప్రతిపక్షమూ చేయలేదు. అడపాదడపా చేసినా అవి వాళ్ల రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే. లేదా ప్రతిపక్షాలుగా తమ ఉనికి చాటుకునేందుకు బాధితుల తరపున మాట వినిపించి వచ్చారే తప్ప సమస్య పరిష్కారం కోసం నిజాయితీగా కృషి చేసిన దాఖలాలు లేవు.

అందుకే పాలక, ప్రతిపక్షాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు. అదే పిడిఎఫ్‌కు ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. ఎన్నికల రాజకీయాల కోసమో, పదవుల కోసమో, సొంత ప్రయోజనాల కోసమో పిడిఎఫ్ అభ్యర్థులు పోటీ చేయరు. ప్రజా సమస్యలు వినిపించేందుకు, బాధితులకు బాసటగా ఉండేందుకే పిడిఎఫ్ పోటీలో నిలుస్తుందనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. నిజాయితీగా పిడిఎఫ్ పనితీరును గమనించిన ఎవరైనా సరే పాలక, ప్రతిపక్షాల వైపు మొగ్గు చూపరు. అటువంటి ఒక బ్రాండ్ ఇమేజ్‌ను క్రియేట్ చేసుకుంది పిడిఎఫ్. ప్రజా సమస్యలపై పోరాడే, మాట్లాడే వేదికగా పిడిఎఫ్‌ను ప్రజలు చూస్తున్నారు.

ప్రజలు చేసిన ప్రతి పోరాటాన్ని బలపరిచాం

పిడిఎఫ్‌గా అంగన్వాడీ, ఆశ, మిడ్‌డే మీల్స్, వాలంటీర్లు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, అవుట్‌సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగులు, మెడికల్ హెల్త్ డిపార్టుమెంట్లలో పని చేస్తున్న వారు విద్యార్థులతోపాటు ఏవైతే వర్గ, ప్రజాసంఘాలు ఉన్నాయో వారు చేసే పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నాం. పిలిస్తే పలికేది పిడిఎఫ్. రమ్మంటే వచ్చేది పిడిఎఫ్. ఆ రకమైన పద్ధతుల్లో మేధో శ్రమజీవులు, శ్రామిక జీవుల పక్షాన పిడిఎఫ్ ఉంటుంది. పిడిఎఫ్ రాజకీయ పక్షం కాదు. రాజకీయ రహితమూ కాదు. కానీ పిడిఎఫ్ కచ్చితంగా ప్రజా రాజకీయాలు చేస్తుంది. పిడిఎఫ్‌ది వ్యక్తిగత విమర్శ కాదు. విధానపరమైన విమర్శ.

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

28 వరకూ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 28వ తేదీ వరకూ ఆర్‌బిఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడే దేశం దిన దినాభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలు వారు సంపాదించిన, సమకూరిన ప్రతి ఒక్క రూపాయినీ ప్రణాళిక బద్ధంగా అవసరమైన మేరకు మాత్రమే ఖర్చు చేసి, పొదుపు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వృథా ఖర్చులకు పోవడం వంటివి అదుపులో ఉంచుకోవాలన్నారు. డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, పిడి డిఆర్‌డిఎ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, జిల్లా టూరిజం అధికారి కె.వెంకటఅప్పారావు పాల్గొన్నారు.

చదువుకునేందుకు మెరుగైన అవకాశాలు కల్పించాలి

బేడ (బుడ్గ), జంగం పిల్లలు చదువుకునేందుకు మెరుగైన అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్లో వీరవాసరం మండలం పెర్కిపాలెం గ్రామానికి చెందిన బేడ (బుడ్గ) జంగం కుటుంబాలు ఎస్‌సి కుల ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. వారి కుల ధ్రువీకరణ అంశం ప్రభుత్వ పరిధిలో ఉందని, ఈ విజ్ఞప్తిని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. జిల్లాకు కొత్తగా బాల సదన్ కేటాయించడం జరిగిందని, పిల్లలకు రక్షణగా ఉండాలంటే ప్రభుత్వ వసతి గృహాల్లో మాత్రమే చేర్పించాలని తెలిపారు. డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, డిఇఒ ఇ.నారాయణ, ఐసిడిఎస్ నోడల్ అధికారి విజయలక్ష్మి, బేడ, జంగం హక్కుల పోరాట సమితి సభ్యులు కుమారి శ్రీనివాస్, కుమారి సత్యనారాయణ, కుమారి శ్రీను పాల్గొన్నారు.

నేటితో ఎన్నికల ప్రచారానికి తెర

ముగియనున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం
పోలింగ్ కేంద్రాల సమీపంలో మద్యం దుకాణాలు రెండు రోజులు బంద్
పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు, నేడు ఎన్నికల సామగ్రి పంపిణీ
ఉత్కంఠ రేపుతున్న ఎన్నికల సమరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ఐదు గంటలతో ముగియనుంది. మరో 48 గంటల్లో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ఎన్నికల పోరు ఉత్కంఠ రేపుతోంది. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందించే ప్రక్రియ జరగనుంది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎన్నికల రోజు 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ కేంద్రాల సమీపంలో మద్యం దుకాణాలను మూసివేయాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలు జారీ చేశారు. జనవరి 29న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి మూడో తేదీన నోటిఫికేషన్ విడుదల చేయడంతో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఫిబ్రవరి పదో తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ సాగింది. 13న విత్‌డ్రాల పర్వంతో నామినేషన్ల ఘట్టం ముగిసింది. మొత్తం 35 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కొద్దిరోజులుగా ఎన్నికల ప్రచార పర్వం నువ్వా నేనా అన్నట్లు సాగింది. అధికార పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఓటు వేయాలని సిఎం చంద్రబాబు నుంచి మంత్రులు, ఎంపీలు, ఎంఎల్ఎలు, జిల్లా, మండల, గ్రామానికి చెందిన కూటమి పార్టీల నాయకులు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. ఆడియో ఫోన్లు చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు తరపున ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు, నిరుద్యోగులు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. చాప కింద నీరులా పిడిఎఫ్ అభ్యర్థి ప్రచారం సాగింది. టిడిపికి దీటుగా నువ్వానేనా అన్నట్లు పిడిఎఫ్ అభ్యర్థి ప్రచారం నిర్వహించారు. దీంతో పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉత్కంఠ రేపుతున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 3,14,984 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. దీనికోసం రెండు జిల్లాల పరిధిలో 456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లాలో 62 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మంగళవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుండటంతో అధికార పార్టీ జిమ్మిక్కులకు దిగే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. అధికారులు నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని అంతా కోరుతున్నారు.

రెవెన్యూ ఉద్యోగుల తొలగింపు నిర్ణయం తగదు

ఎన్‌జిఒ రాష్ట్ర నాయకులు ఎల్‌వి.సాగర్

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలో రెవెన్యూ ఉద్యోగులను తొలగించాలనే నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర నాయకులు ఎల్‌వి.సాగర్ హెచ్చరించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉద్యోగులకు డిఎ పెండింగ్ ఉండదని చంద్రబాబు ఇచ్చిన హామీని తుంగలోతొక్కారని విమర్శించారు. 2018 నుంచి డిఎ బకాయిలు ఉన్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు ఇంతవరకూ నెరవేర్చకపోవడం సరికాదని విమర్శించారు. రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ డేటా ఆపరేటర్లను ఎంఎల్‌సి ఎన్నికల అనంతరం తొలగిస్తామనే ప్రభుత్వ చర్యలను తిప్పికొట్టి ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రెవెన్యూ ఉద్యోగులను కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎన్‌జిఒ రాష్ట్ర నాయకులు సాగర్

డివి.రాఘవులును గెలిపించడమే కర్తవ్యం

ఉద్యోగ , ఉపాధ్యాయ, లాయర్, దళిత, ప్రజాసంఘాల నేతలు

భీమవరం : ఓట్లు అభ్యర్థిస్తున్న ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రస్తుత పరిస్థితుల్లో శాసనమండలిలో పిడిఎఫ్ అవసరం ఎంతో ఉందని, ఈ నేపథ్యంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులును గెలిపించుకోవాల్సిన కర్తవ్యం అందరిపైనా ఉందని పలువురు వక్తలు అన్నారు. భీమవరంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, లాయర్స్ సంఘాలు, దళిత సంఘాల నేతలు బలపర్చి సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి న్యూటన్ మాట్లాడుతూ నేటి రాజకీయాల్లో నైతిక విలువలు, నీతి నిజాయతీలు కరువయ్యాయన్నారు. నేటి సమాజంలో రాజకీయ నైతిక విలువలు కలిగిన పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, కాంగ్రెస్ ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు రాజ్‌కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ హక్కులను కాలరాసేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ శాసనమండలిలో ప్రశ్నించే గొంతుగా ఉండాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. బ్యాలెట్ పేపర్లో 14వ నంబర్లో తొలి ప్రాధాన్యతా ఓటు వేసి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.విజయరామరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, ఉపాధ్యాయ జిల్లా నేతలు, ప్రజాసంఘాల జిల్లా నేతలు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల మండల నేత ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దెయ్యాల తిప్ప, గూట్లపాడు గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో పి.లక్ష్మీపతి, బి.నాగేశ్వరరావు, ఎం.ఆంజనేయులు, శుభకరం, రామకృష్ణ పాల్గొన్నారు.

పాలకోడేరు : పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు పిలుపునిచ్చారు. సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మోగల్లులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ యువత ఉపాధి కోసం మాట్లాడేది కేవలం పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమేనన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు పాలా వెంకటస్వామి, సైదులు లక్ష్మణ్ పాల్గొన్నారు.



పాలకోడేరు మండలంలో..

పెంటపాడు: దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి ఎంఎల్‌సిగా గెలిపించాలని పలు సంఘాల నేతలు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపవరపు రంగారావు, బంకూరు నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఒ.లోకేష్, ఒ.తేజ, యండ్రపు శంకర్, ఆర్.మహంకాళి, కి.శివ, ఆర్.శీను, దత్తు రాము, మీసాల శ్రీనివాస్, పెనగంటి దుర్గ, కేతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కరక వెంకట్రావు పాల్గొన్నారు.

ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

పెనుగొండ : మండలంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ టి.ఎస్తేరు క్వీన్ ప్రకటనలో తెలిపారు. మార్చి 6వ తేదీ నుంచి ఈ సేవ కేంద్రంలో నమోదు చేసుకోవాలని, ఏప్రిల్ 6వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, ఇతర వివరాల కోసం విద్యార్థి సమీపంలోని గురుకుల పాఠశాలలో వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

క్లబ్‌లు కావు.. సంస్థలు

కోర్టు అనుమతితోనే సంస్థలు నడుస్తున్నాయి : 3 క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు

భీమవరం టౌన్ : మూడీ క్లబ్‌లు కావవి సంస్థలని, కోర్టు అనుమతితోనే సంస్థలు నడుస్తున్నాయని భీమవరం మూడు క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు పద్మనాభరాజు, పెన్మెత్స వెంకట రామరాజు, కోళ్ళ రామచంద్రరావు, బేతు కృష్ణారావు, నరసింహ మూర్తిరాజు, మంతెన సూర్యనారాయణ రాజు, రామకృష్ణంరాజు అన్నారు. సోమవారం కాస్మో పాలిటిన్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంఎల్‌ఎ అంజిబాబుకు, క్లబ్‌లకు సంబంధం ఉందంటూ ప్రచారాలు చేయడం సరికాదని, సమాజ అభివృద్ధికి విద్య, వైద్యం, క్రీడలకు, వరద బాధితులకు తమ వంతుగా ఎంఎల్‌ఎ అంజిబాబుచే సహకారం అందిస్తున్నామని, ఎప్పుడు మచ్చలేని ఎంఎల్‌ఎ క్లబ్‌ల ద్వారా ఏదో లబ్ధి పొందుతున్నారని ప్రచారాలు చేస్తున్నారని, నిజాలు తెలుసుకుని ప్రచారాలు చేయాలని అన్నారు. లేదంటే సంస్థల వివరణ తీసుకోవాలని, ఏదైతే అసత్య ప్రచారం చేసిందో రానున్న రోజుల్లో అసత్య ప్రచారాలు చేస్తే తాము కూడా సంస్థల ద్వారా చర్యలు తీసుకుంటామని అన్నారు.

మహిళా పురస్కారానికి దరఖాస్తుల స్వీకరణ

పెనుమంట్ర : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారతలో వివిధ రంగాలలో కృషిచేసిన, చేస్తున్న మహిళలకు పురస్కారాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా అవార్డ్స్ కమిటీ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం, క్రీడలు, కళలు, కవితలు, సామాజిక సేవా కార్యక్రమాలలో స్వచ్ఛంద సంస్థల ద్వారా, వ్యక్తిగతంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మహిళా అభ్యర్థుల నుంచి ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తులు కోరుతున్నామని వారు పేర్కొన్నారు. కేవలం వాట్సప్ ద్వారా బయోడేటా, ఆయా రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ఫలితాలు తదితర వివరాలను వాట్సాప్ నంబర్ 9951720745కు పంపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత అధికారులచే గౌరవ మహిళా పురస్కారాలు అందజేస్తామని అన్నారు. మార్చి 7 శుక్రవారం ఉదయం 10 గంటలకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విజ్ఞాన సాంస్కృతిక భవనం, వీరమ్మ చెర్వు వద్ద, గునుపూడి–భీమవరంలో అవార్డుల వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు.

గ్రామాలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

మొగల్తూరు : గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపిపి అందే సూర్యావతి భుజంగరావు అన్నారు. మొగల్తూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులతో శాఖల వారీగా గ్రామాలలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వచ్చే వేసవికాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కాళీపట్నంలో మంజూరైన పిహెచ్‌సి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాబ్జి కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు కైలా సుబ్బారావు, కవరు సీతామాలక్ష్మి, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని, ఎంపిడిఒ పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ నాయకర్‌కు టైఫాయిడ్

నరసాపురం : ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అస్వస్థతకు గురయ్యారు. గత నాలుగు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నారు. సోమవారం ఆరోగ్యం క్షీణించడంతో నరసాపురంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. పరీక్షలు అనంతరం నాయకర్‌కు టైఫాయిడ్ వచ్చినట్లు వైద్యులు తెలిపారు. నాయకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎం.ఎ.షరీఫ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ(చిన్నా), టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పరామర్శించారు. నాయకర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎక్కువగా రావడంతో వైద్యం నిమిత్తం నాయకర్ నరసాపురం నుంచి భీమవరంలోని ఆసుపత్రిలో చేరి వైద్యం పొందుతున్నారు. బొమ్మిడి నాయకర్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంఎల్‌ఎ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

కొనసాగిన జ్ఞానజ్యోతి శిక్షణ

ఆకివీడు : అంగన్వాడీలకు విద్యాశాఖ, ఐసిడిఎస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐదోరోజు శిక్షణ సాగింది. అంగన్వాడీ స్థాయి పూర్తయిన అనంతరం పూర్వ ప్రాథమిక విద్యకి(కిండర్ గార్డెన్)కు పంపేందుకు అవసరమైన పిపి–1, పిపి–2 శిక్షణ పూర్తి చేశారు. ఇసిసి డే స్నాతకోత్సవం, పాఠశాల సంసిద్ధత వంటి అంశాలలో మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమానికి డిఆర్‌పిలుగా ఎండి ఇస్మాయిల్ చౌదరి, డి.నాగభూషణం, బి.రాంబాబు వ్యవహరించారు. రాష్ట్ర రిసోర్స్ పర్సన్ జివిఎస్.పురుషోత్తం ప్రత్యేక పరిశీలనకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ఆర్.రవీంద్ర, ఎ.సీతారామయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్లు బిఆర్.రత్నకుమారి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాపీ మేస్త్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన వినతి

మొగల్తూరు : భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం తాపీ మేస్త్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. గతంలో భవననిర్మాణ కార్మికులకు అమలు చేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కలిలి సత్యనారాయణకు అందించారు. ఆయా కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు చల్లా మురళీకృష్ణ, కార్యదర్శి షేక్ ప్రసాద్, సభ్యులు ఉన్నారు.

రైతుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

ఉండి : అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో గవర్నర్ ప్రసంగం జరుగుతుండగా వైసిపికి చెందిన ఎంఎల్‌ఎలు అసెంబ్లీని బహిష్కరించి వెళ్లడం సబబు కాదని యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి గోపాలకృష్ణంరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో శాంతియుత వాతావరణం నెలకొనాలని, గతంలో మాదిరిగా అసెంబ్లీ మొత్తం బూతుల ప్రపంచం కాకుండా చూడాలని ఆయన కోరారు. 175 మంది ఎంఎల్‌ఎలు ప్రజా సమస్యలపై, రైతు శ్రేయస్సు కోసం, కార్మికుల ఉపాధి కోసం చర్చించి వారికి న్యాయం జరిగేలా చూడాలి తప్ప ఒకరు ఒకరు విమర్శలు చేసుకుంటూ సమావేశాలను వృథా చేయరాదని ఆయన సూచించారు.

నేరాలు – ఘోరాలు

భార్యపై కొడవలితో భర్త దాడి

ఉండి : భార్యపై అనుమానంతో కొడవలితో భర్త దాడి చేసిన సంఘటన ఉండి మండలం ఆరేడులో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండి గ్రామానికి చెందిన భావన సురేష్ కుమార్, ఆరేడు గ్రామానికి చెందిన పెనికల జ్యోతి కుమార్తె దేవిని 10 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. గత మూడు సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం సురేష్ కుమార్ మస్కట్ వెళ్లి జీవనం సంక్రాంతి సమయంలో ఇంటికి వచ్చాడు. దేవి సమీప బంధువుతో సన్నిహితంగా ఉండటంతో ఆమెపై అనుమానం పెంచుకున్న భావన సురేష్ కుమార్ సోమవారం సాయంత్రం దేవితో గొడవపడి పక్కనే ఉన్న కొడవలి తీసుకుని దేవిపై దాడి చేయగా అడ్డుగా వచ్చిన దేవి తల్లి ధనలక్ష్మిపై దాడి చేసి పరారయ్యాడు. గాయాలతో ఉన్న దేవి, తన తల్లి ధనలక్ష్మిని స్థానికులు 108 సహాయంతో భీమవరం ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు.

ఫ్లెక్సీలకు నిప్పు : వ్యక్తిపై కేసు

ఉండి : ఫ్లెక్సీలకు నిప్పు పెట్టి గ్రామంలో రెండు వర్గాల మధ్య గొడవలు చెలరేగేలా వ్యవహరిస్తున్న వ్యక్తిపై ఉండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కలిగొట్ల గ్రామంలో స్థానిక ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఫ్లెక్సీలను కొందరు వ్యక్తులు ఏర్పాటు చేయగా, అదే గ్రామానికి చెందిన దాసరి సుధాకర్, దాసరి కిషోర్, ఏటేటి రాజశేఖర్, దాసరి కిరణ్ అని వారు ఫ్లెక్సీలకు నిప్పు పెట్టి గ్రామంలో గొడవలు చెలరేగేలా వ్యవహరిస్తున్నారని శ్యామ్యూల్ రాజు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రజలు లేని ప్రజావేదిక

ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ ఉందంటూ మమ అనిపించిన అధికారులు

సమన్వయం లేకే సమస్యలు : డ్వామా పీడీ అప్పారావు

దస్త్రాలు పరిశీలిస్తున్న డ్వామా పీడీ అప్పారావు

పాలకోడేరు : భీమవరం కలెక్టరేట్లోని డ్వామా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పాలకోడేరు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సామాజిక తనిఖీ ప్రజావేదికపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ ఉందంటూ సాకు చూపి కేవలం రెండు గంటల సమయంలో తనిఖీ చేసి అధికారులు మమ అనిపించారు. పేరుకు పబ్లిక్ హీరింగ్ అయినప్పటికీ కనీసం ప్రజలు లేకుండానే ప్రజావేదిక నిర్వహించడం స్థానికంగా చర్చనీయం అయింది. మండలంలోని 14 గ్రామాలు 2024–2025 సంవత్సరానికి గాను రూ.4 కోట్లు కూలీలకు వేతనాల రూపంలోనూ, రూ.2 కోట్లు పంచాయతీరాజ్ మెటీరియల్ పనుల నిమిత్తం ఖర్చు చేయడం జరిగింది. దీనికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించి ఆడిట్ దృష్టికి వచ్చిన అంశాలను బహిరంగపరచాల్సి ఉంటుంది. అయితే ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమానికి డ్వామా కెసిహెచ్.అప్పారావు అధ్యక్షత వహించారు. గ్రామాల వారీగా ఫీల్డ్ అసిస్టెంట్లు సీనియర్ మెట్లు రికార్డులను తనిఖీ చేశారు. వారు చేసిన అనేక లోటుపాట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమన్వయం లేకపోవడంతోనే సమస్యలు వస్తున్నాయని, ఇది సరైనది కాదని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డ్రామా విజిలెన్స్ అధికారి కె.పురుషోత్తం, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.సుజాత, ఎంపిడిఒ రెడ్డియ్య పాల్గొన్నారు.

ముగ్గురు అధికారులకు, ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమోలు

పాలకోడేరు మండల పరిషత్తు అధికారి వి.రెడ్డియ్య, ఎన్ఆర్జిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ పి.జయబాబు, కంప్యూటర్ ఆపరేటర్ మధుబాబులకు డ్వామా పీడీ అప్పారావు మెమో జారీ చేశారు. సామాజిక తనిఖీ ప్రజావేదికకు సంబంధించిన సమాచారాన్ని కింద స్థాయికి చేరవేయడంలో నిర్లక్ష్యం వహించడానికి గాను మెమోలు జారీ చేయడం జరిగింది. అలాగే కొండేపూడి, పెన్నాడ అగ్రహారం, మైప ఫీల్డ్ అసిస్టెంట్లు దేవకుమార్, పి.అప్పారావు, మోహన్ రావు మెమోలు జారీచేశారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఎటువంటి ఫొటోలు అప్లోడ్ చేయకుండా వేంద్ర అగ్రహారంలో రూ.5.80 లక్షలు, పెన్నాడలో రూ.1.31 లక్షలు చెల్లించినట్లు గుర్తించారు. అలాగే రికార్డులు సక్రమంగా లేకపోవడం, ఉపాధి కార్డులు అప్డేట్ చేయకపోవడం వంటి వాటికి బాధ్యులుగా చేస్తూ మెమోలు జారీ చేయడం జరిగింది.

హౌసింగ్ ఎఇ నరసింహారావుకు షోకజ్ జారీ

ఎంతో ప్రతిష్టాత్మంగా జరుగుతున్న సామాజిక తనిఖీ ప్రజావేదికకు పాలకోడేరు హౌసింగ్ ఎఇ బివి.నరసింహారావు గైహాజరు కావడం పట్ల డ్వామా పీడీ అప్పారావు షో కాజ్ నోటీసులు జారీ చేశారు. 14 గ్రామాల్లో ఉపాధి హామీ చట్టంలో జరిగిన పనుల్లో ప్రధాన భాగంగా గృహ నిర్మాణ శాఖ ఉంది. దీనికి తోడు గృహ నిర్మాణాలకు సంబంధించిన వివిధ స్టేజ్‌లలో తీసిన ఫొటోలు అప్లోడ్ చేయకుండానే బిల్లులు చేయడం జరిగింది. సామాజిక తనిఖీలు బట్టబయలు అయినప్పటికీ అసలు ఎందుకు జరిగిందో చెప్పేందుకు సంబంధిత అధికారి అందుబాటులో లేకపోవడం, ఆయన స్థానంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను సమయానికి పంపించకపోవడంతో సోకజ్ నోటీసులు జారీచేసినట్లు పీడీ అప్పారావు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులు ఉరుకులు, పరుగులు

సామాజిక తనిఖీ ప్రజావేదికకు పంచాయతీ కార్యదర్శులు ఉరుకులు, పరుగులు పెట్టారు. ప్రజావేదిక జరుగుతున్నట్లు కనీసం ముందస్తు సమాచారం లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ప్రజావేదికకు వెళ్లాలని సమాచారం అందించినా ఆయా పంచాయతీ కార్యాలయాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చేందుకు కార్యదర్శులు నానా అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో కొంతమంది కార్యదర్శులు సమయం మించిపోయిన తర్వాత, మరికొంత మంది 12:30 నిమిషాలు దాటిన తర్వాత, ఇంకొంతమంది సామాజిక తనిఖీ ముగిసిన తర్వాత హాజరు కావడం జరిగింది.

రామ్మూర్తి విశిష్ట సేవలు అభినందనీయం

ప్రజాశక్తి – కాళ్ల


రామ్మూర్తిని సత్కరిస్తున్న సర్పంచి

గతంలో గ్రామ ఉప సర్పంచిగా కోరా రామ్మూర్తి విశిష్ట సేవలు అందించడం అభినందనీయమని గ్రామ సర్పంచి సోమేశ్వరరావు అన్నారు. పెదఅమిరంలో సర్పంచి డొక్కు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం కోరా రామ్మూర్తి సత్కారసభ నిర్వహించారు. పెదఅమిరం గ్రామం నుంచి రామ్మూర్తి సికింద్రాబాద్ రైల్వే జోన్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా నియమితులయ్యారు. దీంతో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు రామ్మూర్తిని ఘనంగా సత్కరించారు. పెదఅమిరం గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని పలువురు వక్తలు కోరారు.

చంద్రపాల్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి – నరసాపురం


సాయం అందిస్తున్న పోలిశెట్టి

మండలంలోని కొప్పర్రు గ్రామానికి చెందిన బుగ్గే చంద్రపాల్ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందారు. సోమవారం చంద్రపాల్ కుటుంబ సభ్యులను జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ పరామర్శించి రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషిచేస్తానని, అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

మత్స్యకారుల వలలో 20 కేజీల పండుగప్ప

ప్రజాశక్తి – ఆచంట

వశిష్ట గోదావరిలో సుమారు 20 కేజీల పండుగప్ప వలకు చిక్కింది. దీని విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని మత్స్యకారులు గడ్డం శ్రీను అంచనా వేశారు. దీనిని మత్స్యకారులు సోమవారం సాయంత్రం ఆచంటకు అమ్మకానికి తీసుకువచ్చారు. ఈ భారీ పండుగప్పను స్థానికులు రూ.12 వేలకు కొనుగోలు చేసి వాటాలు వేసుకున్నారు. దీంతో మత్స్యకారుడు గడ్డం శ్రీనుకు పంట పండింది.

ఎస్ఎస్‌సి సెంటర్ల పరిశీలన

ప్రజాశక్తి – గణపవరం

మండలంలోని గణపవరం, పిప్పర, అర్ధవరం గ్రామాల్లోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌సి సెంటర్లను సోమవారం గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మీ, ఎంఇఒ బాలయ్య పరిశీలించారు. స్కూల్లో ఫర్నిచర్, తాగునీరు, టాయిలెట్స్ వంటి కనీస సౌకర్యాలపై స్థానిక ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అదించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించకుండా చూడాలని చెప్పారు.

కనీస సమస్యలైనా తీర్చండి

కౌన్సిలర్ నాగేశ్వరరావు

ఆకివీడు : పట్టణంలోని కనీస సమస్యలైనా అధికారులు తీర్చకపోతే ప్రజలు హర్షించే పరిస్థితి లేదని కౌన్సిలర్ నిమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం పాలకవర్గ ఛైర్‌పర్సన్ జామీ హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అజెండా లేకుండానే సాగింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో సుమారు నెలరోజుల క్రితం ఆమోదించవలసిన బడ్జెట్‌ను ఇప్పటికి రెండుసార్లు ఆపారు. రెండు నెలల నుంచి ఏవిధమైన అజెండా లేకుండానే సమావేశమై వెళ్లిపోతున్నారు. అయితే సోమవారం జరిగిన సమావేశంలో సభ్యులు పట్టణంలో ఉన్న పలు సమస్యలు లేవనెత్తారు. మంచినీరు పసర్లతో కూడుకుని ఇబ్బందిగా ఉన్నాయని, వీటిని పూర్తిస్థాయిలో శుద్ధం చేయాలని కోరారు. మురుగు, చెత్త ఎక్కడికక్కడ పెరుగుతున్నాయని, ఎప్పటికప్పుడు బాగు చేయాలని నాగేశ్వరరావు సూచించారు. ఈ సమావేశంలో సభ్యులు పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ పూర్తి అయితే తప్ప పూర్తి బడ్జెట్ ఆమోదించే పరిస్థితి లేదు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

భీమవరం : ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి, జప్తు చేసిన ఆస్తులన్నింటినీ కోర్టులో అబ్సెల్యూట్ చేయించాలన్నారు. ఈ మేరకు అగ్రిగోల్డ్ బాధితులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితుల విషయంపై చర్చించి బడ్జెట్ కేటాయించి సత్వర న్యాయం చేయించాలని కోరారు. అత్యవసర వైద్యం, విద్య, బిడ్డల పెళ్లిళ్ల వంటి అవసరాలు ఉన్నవారికి, లక్షలోపు డిపాజిట్ చేసిన చిన్న పొదుపుదారులకు తక్షణం చెల్లింపులకు తగు ఏర్పాట్లు చేసి మరో డిపాజిట్ దారుడు బలికాకుండా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం శాఖ గౌరవాధ్యక్షులు ఎం.సీతారాంప్రసాద్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.నాగలక్ష్మి, కె.సూర్యనారాయణ, ఎన్.శ్రీనివాస్, ఐవివి.సత్యనారాయణ, డి.నాగిరెడ్డి, సాదే సామ్యూల్‌రాజు, ఎన్.బ్రహ్మాజీ, ఎన్.రామశ్రీను పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ప్రదర్శన

భీమవరం టౌన్ : భీమవరం దిరుసుమర్రు రహదారిలో ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్–పర్యావరణ పరిరక్షణ అంశంపై మావుళ్లమ్మ గుడి సెంటర్‌లో సోమవారం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ముప్పు అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలకు 500 జనపనార సంచులు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కమలాకర్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.కళ్యాణ్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. సామాజిక స్ఫూర్తితో ఈ కార్యక్రమం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ యూనిట్ అధ్యాపకులను ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు అభినందించారు.

నియోజకవర్గ దార్శనిక ప్రణాళికను రూపొందించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరం : సమగ్ర అభివృద్ధికి నియోజకవర్గ దార్శనిక ప్రణాళికను రూపొందించి అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్లో జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ దార్శనిక ప్రణాళిక రూపకల్పనపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ నియోజకవర్గం వారీగా దార్శనిక ప్రణాళిక రూపకల్పనలో నియోజకవర్గ జనాభా, భౌగోళిక, ఆర్థిక, మౌలిక సదుపాయాలు సమగ్ర అవగాహనతో ప్రణాళికను రూపొందించాలన్నారు. ప్రధాన సహజ వనరులైన నది, పర్యాటక ప్రదేశాలు, వ్యవసాయ మండలాలు, పారిశ్రామిక ప్రాంతాలు, ప్రముఖ ప్రదేశాలు మొదలైనవి పరిగణలోకి తీసుకోవాలన్నారు. ప్రస్తుత జనాభా గణాంకాలు, అక్షరాస్యత రేటు, శ్రామిక శక్తిలో స్త్రీ, పురుషులు భాగస్వామ్యం పొందుపర్చాలన్నారు. ప్రస్తుత ఆరోగ్య సంరక్షణ, విద్య, గృహ సౌకర్యాల స్థితి, రవాణా, నీటి సరఫరా, విద్యుత్, ప్రజా సౌకర్యాలను చేర్చడంతో పాటు ప్రత్యేకమైన పర్యావరణ, సాంస్కృతిక అంశాలను హైలైట్ చేసి చూపాలన్నారు. వ్యవసాయం, పరిశ్రమ, విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా, ప్రభుత్వం సంతోషకరమైన, ఆరోగ్యకరమైన, సంపన్నమైన సమాజాన్ని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గ విజన్ ప్లాన్ రూపకల్పనలో ప్రతి నియోజకవర్గానికీ ఒక నోడల్ అధికారిని నియమించడం జరిగిందన్నారు. వీరు స్థానిక శాసనసభ్యుల సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకొని విజన్ ప్రణాళిక రూపకల్పనలో పాలుపంచుకోవాలన్నారు. ఏప్రిల్ 30 నాటికి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌లను పూర్తి చేసి అందజేయాల్సి ఉంటుందన్నారు.

పీపుల్ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

పీపుల్ సర్వేను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. పి–4 విధానం ద్వారా పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడానికి జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలోని 20 శాతం మంది నిరుపేదలను గుర్తించడానికి నిర్వహించే సర్వే అన్నారు. స్వర్ణ ఆంధ్ర విజన్ 2047ను సక్రమంగా అమలు చేయడానికి ఈ పీపుల్ సర్వే అత్యంత ప్రామాణికంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, సిపిఒ కంటిపూడి శ్రీనివాసరావు, జిల్లా, గ్రామ, వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా ఫారెస్ట్ అధికారి ఆశాకిరణ్, డిఇఒ ఇ.నారాయణ, ఎపిసి పి.శ్యాంసుందర్, హౌసింగ్ పీడీ వై.హరిహరనాథ్, డిపిఒ బి.అరుణశ్రీ, జిల్లా టూరిజం శాఖ అధికారి ఎవి.అప్పారావు, డిఎంహెచ్ఒ బి.భానునాయక్, బి.జిల్లా విద్యుత్ శాఖ అధికారి రఘునాథ్ బాబు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ఆచంటలో విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయం

ప్రజాశక్తి – ఆచంట

శివరాత్రి సందర్భంగా ఆచంటలో కొలువైన శ్రీరామేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ వెలుపల చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. పందిర్లను రంగురంగుల వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి ఆలయంతో పాటు స్థానిక కచేరి సెంటర్ నుంచి స్వామివారి సత్రం వరకు ఆచంట–కోడేరు ఆర్‌అండ్‌బి రహదారి వెంబడి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ముఖద్వారం వద్ద యాత్రికులను ఆకర్షించే విధంగా భారీ విద్యుత్ సెట్టింగ్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆచంట – కోడేరు ఆర్‌అండ్‌బి రహదారిలో వాహనాలను నిలుపుదల చేశారు. స్థానిక కచేరి సెంటర్ నుంచి సాయిబాబా ఆలయం, ఎంయుఆర్ జూనియర్ కళాశాల రింగ్ రోడ్డు మీదుగా వాహనాలను మళ్లిస్తున్నారు. యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా బార్కెట్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

ఐదు రోజులపాటు అన్నదాన కార్యక్రమాలు

ఉత్సవాల సందర్భంగా ఐదు రోజులపాటు ఉత్సవాలకు తరలివచ్చే యాత్రికుల కోసం అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు ఏటా నిర్వహించడం ఇక్కడ విశేషం. ఈమేరకు అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచి అన్న సమారాధన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. దాతల సహకారంతో ఐదు రోజులపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్సవ కార్యక్రమాలు..

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు స్వామివారికి ప్రతిరోజు ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ తెలిపారు. ఐదు రోజులపాటు స్వామివారి కళావేదికపై వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం స్వామివారికి దేవస్థానం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం రెండు గంటలకు జెమిని ఆర్కెస్ట్రా, రాత్రి 7 గంటలకు వినయ్ బాయ్స్ డాన్స్, మంగళవారం స్వామివారి గ్రామోత్సవం, అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం రెండు గంటలకు వెరైటీ బుర్రకథ, సాయంత్రం 9 గంటలకు వెంకీ ఆర్కెస్ట్రా భీమవరం, మహాశివరాత్రి సందర్భంగా బుధవారం అంగరంగ వైభవంగా స్వామివారి రథోత్సవం, 9 గంటలకు కనకదుర్గ స్టేజి డ్రామా, గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు వసంత్ ఆర్కెస్ట్రా కార్యక్రమం నిర్వహించిన మధ్యాహ్నం రెండు గంటలకు రాక్ డాన్స్ ఈవెంట్ కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం స్వామివారి పుష్పోత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయి.

పాలకొల్లు : పాలకొల్లు కొత్తపేటలో వేంచేసి ఉన్న భద్రకాళీ వీరభద్ర స్వామివారి దేవస్థానంలో ఈనెల 26న మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ వట్టం గణేష్ తెలిపారు. 26 ఉదయం 8 గంటలకు వైభవంగా ఆన సంబరం, మధ్యాహ్నం 3 గంటలకు అనేక రకాలైన మేళ తాళాలతో స్వామివారి ఊరేగింపు పాలకొల్లు పురవీధులు గుండా జరుగునని తెలిపారు. ఈమేరకు ఆలయంలో కరపత్రాన్ని కమిటీ సభ్యులు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త బాసిన గున్నేశ్వరరావు, ట్రెజరర్ బాసిన సత్యనారాయణ, కార్యదర్శి మానెం బసవరాజు, వట్టం భాస్కరరావు, యర్రా శివాజీ పాల్గొన్నారు.

జోనల్ పోటీల్లో కొమరవరం క్రీడాకారిణుల గెలుపు

ప్రజాశక్తి – తణుకు రూరల్

శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 28న నిర్వహించే సెంట్రల్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు మండలంలోని కొమరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి తెలిపారు. ఇరగవరం మండలం ఇరగవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జోనల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన బాలికల కబడ్డీ జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అదేవిధంగా ఈ పాఠశాలకు చెందిన జంగా అనుపమ డిస్క్‌త్రోలో ప్రథమ స్థానం, షార్ట్‌పుట్లో ద్వితీయ స్థానంలో విజయం సాధించిందన్నారు. ఆయా క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు.

కార్మిక సమస్యలపై దృష్టి సారించాలి

తాడేపల్లిగూడెం : కార్మిక సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణం దృష్టి సారించాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, ఏరియా ఆస్పత్రి కాంట్రాక్ట్ సిబ్బంది సోమవారం ధర్నా చేపట్టారు. ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు తాడేపల్లిగూడెంలో ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని ఎత్తున నినాదాలు చేశారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, ఎఐటియుసి ఏరియా కార్యదర్శి మందలపర్తి హరీష్ పాల్గొన్నారు.

రాజశేఖరాన్ని గెలిపించాలని ప్రచారం

మొగల్తూరు : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల బరిలో నిలిచిన కూటమి అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖరం విజయం తథ్యమని మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారులు ఎం.ఎ.షరీఫ్, మాజీ మంత్రి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. మండలంలోని సేరేపాలెం, కొత్తపాలెం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలిసి ఓట్లను అభ్యర్థించారు. టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, కూటమి నాయకులు గుబ్బల నాగరాజు ఉన్నారు.

కృష్ణమూర్తి కుటుంబసభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి – మొగల్తూరు

రైతు సంఘం నాయకుడు కత్తుల కృష్ణమూర్తి(చిన్నకాపు) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామరాజు సోమవారం కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకుడు అని కొనియాడారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, బొల్ల చంటి, వాతాడి ఉమా, నాగిడి రాంబాబు ఉన్నారు.

టిడిపి నేతకు బెదిరింపులు

ప్రజాశక్తి – ఉండి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకులు యశోద కృష్ణయ్యకు చంపేస్తామంటూ ఒక వ్యక్తి వాట్సప్‌లో మెసేజ్ పంపడంతో భయభ్రాంతులకు గురైన యశోద కృష్ణయ్య ఉండి పోలీసులను ఆశ్రయించారు. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. 8 నెలల క్రితం యశోద కృష్ణయ్య ఇంట్లోకి ఒక వ్యక్తి ప్రవేశించి వెనుక నుంచి చంపడానికి ప్రయత్నించగా పెనుగులాటలో యశోదకృష్ణయ్యకు స్వల్ప గాయాలయ్యాయని, ఆ వ్యక్తి పరారయ్యాడని దానిని పురస్కరించుకుని ఆదివారం గతంలోనే చావుకు దగ్గరలోకి వెళ్లి వచ్చావని, త్వరలోనే చంపేస్తామంటే బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆ మొబైల్ నెంబర్ ఆధారంగా దాసరి కిషోర్ అనే వ్యక్తిపై అనుమానంతో యశోద కృష్ణయ్య ఉండి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా దాసరి కిషోర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేరుమార్పు / సవరణ

నా కుమార్తె షేక్ పాప, (పాత పేరు) D/o షేక్ వలి నివాసం : డోర్ నెం. 5–56, కాలనీ, లింగపాలెం మండలం, కొత్తపల్లి, పశ్చిమ గోదావరి జిల్లా. నా యొక్క కుమార్తె పూర్వపు పేరు **షేక్ పాప** అని ఆధార్‌లో తప్పుగా నమోదు కాబడినది. ఇప్పుడు కొత్తగా పేరు మార్పు / సవరణ చేయగా షేక్ షమ్రిన్ D/o షేక్ వలి, మస్తాన్‌బీ గా మార్పు చేయడం జరిగినది. నేటి నుండి నా కుమార్తె పేరు **షేక్ షమ్రిన్ D/o షేక్ వలి మస్తాన్‌బీ** (SHAIK SHAMRIN D/O SHAIK VALI) పదవ తరగతి మార్కులు మరియు పుట్టినతేది సర్టిఫికెట్ ఆధారంగా మార్పు చేయడం జరిగినది.

CHANGE OF NAME

I, **BANDI VENKATA RAMANI** W/o. Bandi Ganapathi, D.No. 2-81-1, Peda Mamidipalli, Palakol Mandal, W.G.Dt, A.P. I have changed my name from **JAKKAMSETTI VENKATA RAMANA** (Old name) to **BANDI VENKATA RAMANI** (New name) hence forth I am being called **BANDI VENKATA RAMANI** W/o.Bandi Ganapathi for all purposes.

గ్రామపంచాయతీ కార్యాలయము, గొల్లగూడెం

టెండరు ప్రకటన తేది.27-02-2025

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, గొల్లగూడెం గ్రామపంచాయతీలో కాంట్రాక్టు లేబరు పద్ధతిపై ఈ క్రింది పనులు నిర్వహించుటకు ది. 01-04-2025వ తేదీ నుండి ది. 31-03-2026 వరకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. ఈ టెండర్లు ది. 05-03-2025వ తేదీ ఉదయం 11.00లకు పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిచే గానీ లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడి, అదేరోజు సాయంత్రం 2.00 లకు హాజరైన టెండర్లదారుల సమక్షంలో సీల్డు టెండర్లు తెరవబడును. ప్రభుత్వ నిబంధనలకు లోబడి టెండర్లు దాఖలు చేయవలెను. ఇతర వివరముల కొరకు కార్యాలయం పనిచేయు వేళలయందు పంచాయితీ కార్యదర్శిని అడిగి తెలుసుకొనగలరు.

వ.నెం.	పనిపేరు	సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు
1	పారిశుద్ధ్య సిబ్బంది	03	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
2	ఎలక్ట్రీషియన్	01	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
3	పంపు ఆపరేటర్	01	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-

నోట్: 1) గతంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2) పంచాయితీ నిధులు, నిల్వలను బట్టి పేమెంట్ చెల్లించబడును. 3) ఎలక్ట్రీషియన్ పని కొరకు దరఖాస్తు చేసుకొన్న వారు సంబంధిత ప్రావీణ్యతా ధ్రువీకరణ పత్రంను సమర్పించవలెను. 4) టెండర్లను స్వీకరించుటకు లేదా తిరస్కరించుటకు పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.

సం/- **సునంద కొలకలూరి**
పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయతి, నెక్కలం గొల్లగూడెం